క్లుప్తంగా

ఆంజనేయుడికి నాగవల్లి దళార్చన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దక్షిణాముఖ ఆంజనేయుడికి మంగళవారం అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ విశేష పూజలు చేశారు. ఉదయాన్నే పంచామృతాలతో మన్యుసూక్తయుక్తంగా అభిషేకాలు చేసి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్బీకేల ద్వారా మొక్కజొన్న కొనుగోలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలోని పెనుమూలిలో రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారిణి శిరీష మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు పేర్లు నమోదు చేసుకున్న రైతుల వద్ద నుంచి క్వింటా మద్దతు ధర రూ.1962లకు 25 టన్నులను శంకరరెడ్డి, రవీంద్రరెడ్డి దగ్గర కొనుగోలు చేశామని చెప్పారు.

20న ఏపీ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

తాడికొండ: ఏపీ గురుకుల పాఠశాల తాడికొండలో 5–6 తరగతులకు ప్రవేశ పరీక్ష మే 20వ తేదీ నిర్వహించనున్నట్లు తాడికొండ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.బాలశ్రీ తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. హాల్ టికెట్లు ఏపీఆర్ఎస్ డాట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వివరించారు. ఈ నెల 15 నుంచి అభ్యర్థులు పుట్టిన తేదీ ఆధారంగా తమ హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

మద్యం కలిగి ఉన్న ఇద్దరి అరెస్ట్

తాడేపల్లిరూరల్: మద్యం కలిగిన ఉన్న ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. గుంటూరు కొరిటపాడు చైతన్యనగర్‌కు చెందిన నిరంజన్‌కుమార్ రెడ్డి, దివ్యతేజ తెలంగాణ నుంచి లీటర్ పరిమాణం కలిగిన రెండు మద్యం బాటిళ్లు, నాలుగు బీరు బాటిళ్లు తీసుకుని ట్రైన్‌లో వచ్చి తాడేపల్లిలో దిగి అక్కడి నుంచి రైల్వే ట్రాక్ వెంబడి కొలనుకొండ జాతీయ రహదారి వద్దకు వచ్చారు. అక్కడే గస్తీ నిర్వహిస్తున్న సిబ్బంది ప్రశ్నించగా వారు పారిపోయేందుకు ప్రయత్నించినట్లు చెప్పారు. వీరి వద్ద ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ వివరించారు.

తోపుడు బండ్లు అందజేత

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణం, కృష్ణనగర్‌కు చెందిన పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయంతో మంగళవారం తోపుడు బండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు మాట్లాడుతూ తాడేపల్లి కృష్ణనగర్‌కు చెందిన నేలపట్ల ఏలిషమ్మ, దారా లక్ష్మి, యదల కోటయ్య, షేక్ మహబూబ్ సుభాని, మాన్యం అచ్చయ్య అద్దె బండ్లపై చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నిరుపేదలైన ఈ ఐదుగురికి ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహాయంతో తోపుడు బండ్లను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు, తాడేపల్లి పట్టణ అనుబంధ విభాగాల కన్వీనర్లు, ఎస్సీ, బీసీ, మైనార్టీ, సేవాదళ్ నాయకులు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనిల్, బత్తుల దాసు, సయ్యద్ రసూల్, కురుబుర రమేష్, తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిచిలుకోటి శ్రీనివాస మధు, పార్టీ నాయకులు కుంచాల శ్రీను, భూపతి కిషోర్ పాల్గొన్నారు.

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని, కాజ, యర్రబాలెంలకు చెందిన పలువురు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సహకారంతో మంగళవారం తోపుడు బండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, బొమ్ము శివరామిరెడ్డి, ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

'బ్రాహ్మణ' సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తమశర్మ



తెనాలి: ఏపీ బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తెనాలికి చెందిన పోతావఝుల పురుషోత్తమ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరు టౌన్ హాలులో మంగళవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆదోనికి చెందిన వెల్లాల మధుసూదన శర్మ, కోశాధికారిగా కొత్తా ధర్మ సంస్థల అధినేత, ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ సుబ్బారావు ఎన్నికయ్యారు. తెనాలి బ్రాహ్మణ పరిషత్‌కు ప్రధాన కార్యదర్శిగా ఉన్న పురుషోత్తమ శర్మ తాజా ఎన్నికపై పరిషత్ సభ్యులకు అభినందనలు తెలిపారు.

సంక్షేమ హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదే

- వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త సురేష్ కుమార్
- తాడికొండలో గడప గడప మన ప్రభుత్వం



లబ్ధిదారులకు అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్న సురేష్ కుమార్

తాడికొండ: ప్రజలకు వచ్చిన సంక్షేమ హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తాడికొండ జయభారత్ కాలనీలో మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కుటుంబాలకు అందిన సంక్షేమాన్ని వివరించారు. అర్హులకు పథకాల లబ్ధి అందకుంటే గ్రామ సచివాలయంలో అర్జీ అందిస్తే తగిన మంజూరు చేసేందుకు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా జగనన్న అందించిన సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాజధాని పేరుతో నిలువు దోపిడీ చేసిన చంద్రబాబు నాయుడు అదే రాజధానిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయాలని చూసి అట్టర్ ఫ్లాప్ అయ్యాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, తాడికొండ, నిడుముక్కల, కంతేరు, ముక్కామల, బండారుపల్లి సర్పంచులు తోకల సరోజినీ, మాదాసు రత్నకుమారి, బెజ్జం మహేష్ బాబు, ముప్పాళ్ల మనోహర్, చిమటా వెంకటేశ్వర్లు, ఉప సర్పంచి ఉయ్యూరు వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ధూళిపాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి తోకల నరసింహారావు, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, మాజీ యార్డు చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, నాయకులు కొమ్మినేని పున్నారావు, ఆళ్ల హనుమంతరావు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోండి

ఫిరంగిపురం: రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని రిటైర్డు ఎంఈఓ వెంకటరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని గాలిబాలి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను వేసవిలో అందించేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రయోజనకరమైన కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు. వాటిలో భాగంగా కథలు చదవడం, రాయడం, నవలలు, పోటీ పరీక్షలు నిర్వహించడం వంటి వాటితో విద్యార్థులు వేసవి సమయాన్ని వృథా కాకుండా ఉండేందుకు దోహదపడుతుందని చెప్పారు. అనంతరం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసి కేకును కట్‌చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జోసఫ్, శౌరీలు, కె.ఫ్రాన్సిస్, సిబ్బంది జేమ్స్, డి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చేతిరాతపై శిక్షణ

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన 145 మంది విద్యార్థులకు అందమైన చేతిరాతపై మంగళవారం గ్రంథాలయం వద్ద ఉచితంగా శిక్షకుడు జున్నూసాహెబ్ శిక్షణ ఇచ్చాడు. కార్యక్రమంలో పి.ప్రసాద్, పి.సుందర్ పాల్గొన్నారు.

చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిరూరల్: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పెదకొండూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శ్రీధర్ అన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరులోని శ్రీ పట్టిల ముత్యాలమ్మ నాగభూషణం జిల్లా పరిషత్ పాఠశాల ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న అమ్మ వడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పేదల పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలు వరంగా మార్చారని అన్నారు. ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రకాష్‌రావు, నాగరాజు, యోబు, శ్రీనివాసరావు, నీలిమ, ధనలక్ష్మి, గ్రామ సచివాలయ కార్యదర్శి శివశంకరరావు, దాత పట్టిల శివశంకరరావు, పాల్గొన్నారు.

ఈమనిలో..

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా వందశాతం అడ్మిషన్ల నమోదులో భాగంగా 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పాఠశాలలో చేరాలని విన్నవించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.బ్రహ్మేశ్వరరావు, ఎస్.ప్రకాష్‌రావు, జి. శ్రీనివాస్‌రెడ్డి, డి.నాగవేణి, సరోజ, రాఘవమ్మ పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పలువురు బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే ప్రకటించిన ఆర్థిక సాయాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ మంగళవారం అందజేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చుక్కపల్లివారిపాలేనికి చెందిన బాలుడు పీక బాబూరావు కుటుంబానికి రూ.15 వేలు, క్యాన్సర్‌తో బాధపడుతున్న మంద్రు సువార్తమ్మకు రూ.10 వేలు, కిడ్నీ వ్యాధి బాధితురాలు గాలి యేసుదయమ్మకు రూ.10 వేలు, ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన పాకనాటి సిరి కుటుంబానికి రూ.10 వేలు అందించారు. అదే విధంగా తాడిబోయినవారి పాలెం గ్రామానికి చెందిన కాజ బ్రహ్మయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై పనులకు వెళ్లలేక కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందన్న విషయం తెలుసుకుని బ్రహ్మయ్య కుటుంబానికి రూ.15 వేలు అందించారు. కార్యక్రమంలో చుక్కపల్లివారిపాలెం గ్రామ సర్పంచి దాసరి సుందరమ్మ పాల్గొన్నారు.

దుగ్గిరాల 1వ సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్ మోగరాజు లక్ష్మి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భర్త సంజీవ్ అనారోగ్యానికి గురికావడంతో సాయం చేశారు. అందజేసిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు జూపూడి జాన్సన్, మేరుగ ఆనంద్(డింకీ), కాబోతు కర్ప్యూరావు, దార్ల రవి, శ్యామ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనటంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం చౌడవరం గ్రామానికి చెందిన కంచర్ల శ్రీనివాసరావు (46) గుంటూరు నుంచి ఇంటికి తన ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈ క్రమంలో అదే రోడ్డులో చిలకలూరిపేటనుంచి గుంటూరు వైపుగా వెళుతున్న లారీ మితిమీరిన వేగంతో వెళుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులు సమాచారం అందించటంతో పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని బంధువులకు సమాచారం అందించి వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనాథ వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు

పెదకాకాని: హెల్పింగ్ సోల్జర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అనాథ వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. పెదకాకాని మండలం వాసవినగర్ మొదటిలైన్‌లో గత కొంతకాలంగా నివాసంఉంటున్న ఇరువురు వృద్ధులు రోడ్లపై భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారు వరుసకు అన్నచెల్లెలుగా స్థానికులు పేర్కొంటున్నారు. అన్న ప్రభాకర్‌సింగ్‌కు ప్రభుత్వం నుంచి వృద్ధాప్య పింఛన్ పొందుతున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన ప్రభాకర్‌సింగ్(78) అనారోగ్యానికి గురై ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి అంత్యక్రియలు చేసే పరిస్థితి కూడా లేకపోవడంతో స్థానికులు హెల్పింగ్ సోల్జర్స్ చారిటబుల్ ట్రస్ట్ వారికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ట్రస్ట్ ఫౌండర్ షేక్ జబివుల్లా, టీం సభ్యులు షేక్ అహ్మద్, షేక్ ఫజల్, షేక్ సమద్, జ్ఞానచరణ్‌లు మృతదేహాన్ని అంబులెన్స్‌లో తక్కెళ్లపాడు స్మశానవాటికకు తరలించారు. వారి మత సాంప్రదాయం ప్రకారం సోమవారం రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు. ట్రస్టు సభ్యులను స్థానికులు అభినందించారు.

ఉపాధ్యాయులు హక్కుల కోసం పోరాడాలి

యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమకుమారి



మాట్లాడుతున్న కుసుమకుమారి

తెనాలి: ఉపాధ్యాయులు తమ విధులను అంకితభావంతో నిర్వర్తిస్తూనే, హక్కుల కోసం పోరాడాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమకుమారి సూచించారు. యూటీఎఫ్ జిల్లా ఉద్యమ శిక్షణ తరగతులు మంగళవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథుల్లో ఒకరైన కుసుమ కుమారి జెండా ఆవిష్కరణ చేయగా, జిల్లా ప్రధాన కార్యదర్శి కళాధర్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఉపాధ్యాయ ఉద్యమంలో యూటీఎఫ్ ముందుండేలా చూడాలని సూచించారు. ఉపాధ్యాయ ఉద్యమం ప్రాధాన్యం గురించి ఆదినారాయణ తరగతిని నిర్వహించారు. జిల్లా కోశాధికారి మహమ్మద్ గయాసుదుల్లా, పీవీ శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు, శివపార్వతి, దౌల, కె.సాంబ శివరావు, షకీలా, కామాక్షి, బసవేశ్వరరావు, గురుబ్రహ్మం, శ్రీదేవి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సిందూర అర్చన



ఉత్సవాల్లో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు

తెనాలి: స్థానిక షరాఫ్ బజారులోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు, 15వ లక్ష హనుమాన్ చాలీసా పారాయణం వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం శ్రీమన్యుసూక్త హోమం, సిందూర అర్చన వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తనా బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ నెల 24 వరకు జరిగే ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొని, స్వామివారిని దర్శించుకోవాలని అవుతు శ్రీనివాసరెడ్డి కోరారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు ఎస్‌బీ శివ, అర్చకులు కిరణ్, సురేష్, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనూరాధ, సభ్యులు కె.శారద, డి.రామలక్ష్మి, ఎస్.జయ, ఎం.లక్ష్మీసునీత, పీఎల్‌పీ రాణి, సేవాసమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్, గుడివాడ బాలకృష్ణ, బి.లీలాప్రసాద్, ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ఉండాలి



డెంగీపై అవగాహన ర్యాలీలో ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

పొన్నెకల్లు(తాడికొండ): ప్రమాదకర డెంగీ దోమల నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని పొన్నెకల్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి తిరుమలాదేవి అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పొన్నెకల్లు పీహెచ్‌సీ నుంచి ఎస్‌బీఐ బ్యాంకు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పగటి పూట మాత్రమే కుట్టే డెంగీ దోమ ప్రమాదకరమని ప్లేట్‌లెట్‌లు బాగా తగ్గి ప్రాణానికే ప్రమాదం వస్తుంది కనుక అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ భార్గవ్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే డెంగీ నివారణ సాధ్యమని ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ కేంద్ర కీటక జనితవ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ, మలేరియా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరు దోమల వ్యాప్తిని అరికట్టాలనే ఉద్దేశ్యంతో వైద్యసిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించామని అన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వాసుపత్రులలో ఉచితంగా నిర్వహించే రక్తపరీక్ష ద్వారానే డెంగ వ్యాధి నిర్ధారణచేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ నీలోఫర్, మలేరియా అధికారి శ్రీమన్నారాయణ, ఎయిమ్స్ డాక్టర్ అశుతోష్, లెప్రసీ డిపార్ట్‌మెంట్ అధికారి జోసెఫ్, టీబీ డిపార్ట్‌మెంట్ అధికారి మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, మలేరియా సూపర్‌వైజర్లు సాగర్, ప్రసాద్, కడియం శ్రీనివాసు, నరసింహమూర్తి పాల్గొన్నారు.



పొన్నెకల్లులో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

కళాకారుడు సుగుణరాజుకు సన్మానం



సుగుణరాజును సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం దాగుడు మూతలు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం దేవుడు చేసిన మనుషులు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు, రేడియో, టీవీ, సినీ ఆర్టిస్ట్ గురిందపల్లి సుగుణరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి శివరాం ప్రసాద్, బొల్లేపల్లి వెంకట రవీంద్ర ప్రసాద్, పెద్దేటి యోహాను, కొల్లిపర సురేష్‌బాబు, నూతక్కి కోటేశ్వరరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబ శివరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, నరసయ్య పాల్గొన్నారు.

జూన్ 5 వరకు 'మేరీ లైఫ్ మేరీ స్వచ్ఛ్ షెహర్'

నెహ్రూనగర్: మేరీ లైఫ్– మేరీ స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా గుంటూరు నగరంలో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్) విధానాన్ని మే 20 నుంచి జూన్ 5 వరకు అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా నగరవాసులు, వ్యాపార వాణిజ్య సంస్థలు తమ వద్ద ఉన్న ఉపయోగించని, నిరుపయోగంగా ఉన్న దుస్తులు, పాదరక్షలు, పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులు, ఇ–వ్యర్థాలను నగరపాలక సంస్థకు అందిస్తే, వాటిని పునర్వినియోగం, పునరుద్ధరణ లేదా కొత్త ఉత్పత్తికి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వస్తువుల సేకరణ ప్రాంతం, ఇతర అంశాల పై నగరంలో అన్ని వార్డు సచివాలయాల పరిధిలోని శానిటేషన్ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు నిర్వహించిన పలు కార్యక్రమాల్లో గుంటూరు నగరపాలక సంస్థ ముందు భాగంలో ఉందని, ప్రస్తుత మేరీ లైఫ్ – మేరీ స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమంలో కూడా నగర ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములై, ఇంటి వద్దకు వచ్చే వలంటీర్లు, శానిటేషన్ కార్యదర్శుల ద్వారా వచ్చే ఆన్‌లైన్ లింక్ ద్వారా ప్రతిజ్ఞ నిర్వహించి నగర పాలక సంస్థను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు.

అంజనీసుతునికి నృత్య నీరాజనం



శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయ పరివార వేషధారణలో నృత్య కారిణులు

గుంటూరు ఎడ్యుకేషన్: నల్లచెరువు మెయిన్‌రోడ్డులోని ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానంలో 39వ వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. శ్రీనగర్ ఏడో లైనుకు చెందిన అను డ్యాన్స్ అకాడమీ నృత్య కారిణుల బృందం నాట్య గురువు అనూజ పర్యవేక్షణలో సంప్రదాయ భక్తి గీతాలకు కూచిపూడి నృత్యాలతో అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి

పీడీ యుగంధర్ కుమార్



కాకుమాను: గ్రామాలలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు కృషి చేయాలని డ్వామా పీడీ ఎం.యుగంధర్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా యుగంధర్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలలో జాబ్‌కార్డు ఉన్న వారందరికీ వంద రోజులు పని దినాలు కల్పించడం, వారికి రోజుకు రూ.250 తగ్గకుండా వేతనం కల్పించడం, వేతనాలు సకాలంలో వచ్చేవిధంగా చూడాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లదేనని ఆయన తెలిపారు. ఈఏడాది మండలంలో కూలీలకు రూ.5.08 కోట్లు విలువ కలిగిన పనులు కల్పించినట్లు ఆయన తెలిపారు. జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ గ్రామాలలో జాబ్ కార్డులు లేని వారిని గుర్తించి వారందరికీ వంద రోజుల పని దినాలు కల్పించాలని సూచించారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్న దృష్ట్యా కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకుని పనులకు వెళ్లాలని ఆయన తెలిపారు. ఈసందర్భంగా గ్రామాలలో చేపట్టిన పనుల వివరాలను ఎఫ్ఏలు వివరించారు. జిల్లా విజిలెన్స్ అధికారిణి(డీపీఓ)విజయలక్ష్మి, ఎంపీడీఓ శరత్ బాబు పాల్గొన్నారు.